

కెనాల్ నుంచి లీకేజీ అవుతున్న నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్

మూసుకోని కొండపోచమ్మ

కెనాల్ గేట్లు

- భారీగా నీటి లీకేజీ.. పరిశీలించిన కలెక్టర్

మర్కుక్/జగదేవ్‌పూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి భువనగిరి వైపు వెళ్లే కెనాల్ గేట్లు లీక్ అవుతున్నాయి. జగదేవ్‌పూర్ కెనాల్‌లోని నీరు విడుదలయ్యే గేట్లు లీక్ అయి నీటి ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. ఇటీవల వర్షాలు ఎక్కువగా ఉండటంతో 15 టీఎంసీల సామర్థ్యం ఉన్న కొండపోచమ్మలో 11.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో ముందస్తుగా రోజూ ఉదయం జగదేవ్‌పూర్ కెనాల్‌లోకి నీరు విడదలయ్యే గేట్లు ఎత్తుతున్నారు. సాయంత్రం మూసివేస్తున్నారు. బుధవారం సాయంత్రం నీటి పారుదల శాఖ అధికారులు గేట్లు మూసేందుకు ప్రయత్నం చేయగా, పూర్తిగా గేట్లు మూసుకోకపోవడంతో ప్రాజెక్టు నుంచి నీరు లీక్ అవుతోంది. లీకేజీ అంతకంతకూ పెరుగుతుండంతో కాలువలోకి నీటి ప్రవాహం పెరుగుతుంది. ఈ ప్రవాహం వల్ల మండలంతో పాటు జగదేవ్‌పూర్, యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని పలు గ్రామాల పంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. నీటి పారుదల శాఖ డీఈ శ్రీధర్ విషయాన్ని సిద్దిపేట కలెక్టర్ హైమావతికి సమాచారం అందించడంతో ఆమె రాత్రి వేళ ఎస్సై దామోదర్‌తో కలిసి రిజర్వాయర్ వద్దకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేయిస్తున్నామని, రెండు రోజుల్లో పూర్తి మరమ్మతులు చేయిస్తామని కలెక్టర్ చెప్పారు.

రామ్‌మందిర్‌లో దీపాలు వెలిగించి..
సదర్ సంబరంలో హోరెత్తించిన జగ్గారెడ్డి





రామ్‌మందిర్‌లో దీపాలు వెలిగిస్తున్న జగ్గారెడ్డి, సదర్ సమ్మేళనంలో డ్యాన్స్ చేస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్



దున్నరాజుపై జగ్గారెడ్డి

సంగారెడ్డి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : కార్తీకపౌర్ణమి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని రాంనగర్ రామమందిర్‌లో జగ్గారెడ్డి దీపాలు వెలిగించారు. అనంతరం సంగారెడ్డి ఐబీ గెస్ట్‌హౌస్ వద్ద భారీ ఎత్తున నిర్వహించిన సదర్ సమ్మేళనంలో పాల్గొన్నారు. దున్నరాజుపై ఆసీనులై వేదిక వద్దకు చేరుకున్నారు. గొల్లకుర్మలను ఉద్దేశించి మాట్లాడిన తర్వాత తన దైన శైలిలో భజన గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో చేర్యాల ఆంజనేయులు, తోపాజి అనంతకిషన్, కూన సంతోష్, ప్రదీప్, శ్రీశైలంయాదవ్, బాలుయాదవ్, మహేష్, నాగారాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుకుట్టి 18 నెలల

చిన్నారి మృతి



చాణుక్య

మర్కుక్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆడుకుంటున్న 18 నెలల బాలుడిని విషపు పురుగు కుట్టడంతో అక్కడికక్కడే చనిపోయిన ఘటన మర్కుక్ మండలం యూసఫ్‌ఖాన్‌పల్లిలో బుధవారం సాయంత్రం జరిగింది. ఎస్సై దామోదర్ కథనం ప్రకారం.. యూసఫ్‌ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన బసదపు సంధ్య, కుమార్‌ల కుమారుడు 18 నెలల చాణుక్య సాయంత్రం వేళ ఇంటి ఎదుట ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో విషపు పురుగు కరిచింది. దీంతో రోడ్డుపైనే పడి చనిపోయాడు. ఇంట్లో నుంచి బయటకువచ్చి చూసిన తల్లిదండులు హుటాహుటిన గజ్వేల్ జిల్లా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్తీక శోభ

కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు, దైవ దర్శనాలు చేసుకున్నారు. ఉసిరి చెట్టు కింద దీపాలు వెలిగించి, లక్ష ఒత్తులతో దీపారాధన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపాక మండలం మర్పడగలోని మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఉసిరి చెట్టు వద్ద నిర్వహించిన నవావరణ హవనంలో కలెక్టర్ పూజలు చేశారు. దీపోత్సవాన్ని కలెక్టర్ దీపం వెలిగించి ప్రారంభించారు.

- సిద్దిపేట కల్చరల్/హుస్నాబాద్/కొండపాక/వర్గల్/ కొమురవెల్లి/ జగదేవ్‌పూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి)



సిద్దిపేట పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో కార్తీక దీపోత్సవం



కార్తీక దీపాన్ని వెలిగిస్తున్న యువతి



హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లి ఆలయంలో



కొమురవెల్లి : మల్లన్న ఆలయంలో..



సిద్దిపేట పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో



సిద్దిపేట పట్టణంలో...



సిద్దిపేట పట్టణంలోని కోటిలింగాల ఆలయంలో..



మర్పడగలో దీపోత్సవం ప్రారంభిస్తున్న కలెక్టర్



వేంకటేశ్వరాలయంలో సామూహిక వ్రతాలు



జగదేవ్‌పూర్ మండలంరామునిబండ రామాలయం వద్ద కోనేరులో స్నానం చేయడానికి బారులు తీరిన భక్తులు

పెండింగ్ లేకుండా ఇందిరమ్మ ఇళ్ల

బిల్లుల చెల్లింపులు

- తక్కువ స్థలం ఉన్న నలుగురికి ఇళ్లు మంజూరు
- కోతుల బెడద నివారణకు చర్యలు
- సంక్రాంతి నాటికి ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు పూర్తి
- హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ టి. మల్లిఖార్జున్ గౌడ్

ఇంటర్వ్యూ



టి.మల్లిఖార్జున్ గౌడ్

హుస్నాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు పెండింగ్ లేకుండా జరుగుతున్నాయని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ టి.మల్లిఖార్జున్ గౌడ్ తెలిపారు. కొత్త జీవో ప్రకారం తక్కువ స్థలం ఉన్న నలుగురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. పలు అభివృద్ధి పనులకు టెండర్లు వేసి పనులు ప్రారంభించని కాంట్రాక్టర్ల టెండర్లను రద్దు చేసి, రీ-టెండర్లు నిర్వహించి పనులు చేపడుతున్నామని చెప్పారు. పట్టణంలో కోతుల బెడద లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతి ఎలా ఉంది?

హుస్నాబాద్ మున్సిపాలిటీకి 171 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 153ఇళ్లకు గ్రౌండింగ్ అయ్యాయి. వివిధ సమస్యలతో 18 ఇళ్ల నిర్మాణం కావడం లేదు. ప్రస్తుతం 78 ఇళ్ల వాల్ లెవల్, 40 ఇళ్ల స్లాబ్ లెవల్, మిగతావి బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు 126 ఇళ్లకు బిల్లుల చెల్లింపులు జరిగాయి. లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇసుక కొరత లేకుండా ఒక్కో లబ్ధిదారుడికి 8 ఇసుక కూపన్లు ఇస్తున్నాం.

స్థలం తక్కువ ఉన్న లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయా?

కొత్త నిబంధనల ప్రకారం 400 చదరపు గజాల కంటే తక్కువ స్థలం ఉన్న నలుగురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి.

అభివృద్ధి పనులు ఎందుకు ఆగాయి..?

అభివృద్ధి పనులు చేయని కాంట్రాక్టర్ల టెండర్లు రద్దు చేసి రీ-టెండర్లు నిర్వహించాం. పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయి.

కోతుల బెడద నివారణకు తీసుకుంటున్న చర్యలు?

కోతుల బెడదను నివారించేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే కోతులు పట్టేవారిని తీసుకొచ్చి పట్టిస్తున్నాం.

ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనుల పరిస్థితి ఏంటీ?

ఇప్పటివరకు 50 శాతం పనులు పూర్తయ్యాయి. చెరువులో నీరు ఉండటం వల్ల గ్లాస్ బ్రిడ్జి పనులు నిలిచిపోయాయి. మిగతా గ్రీనరీ, ఆర్చరీ ఇతర సుందరీకరణ పనులు సంక్రాంతి నాటికి పూర్తవుతాయి.

సుక్కేసి చిక్కితే
చిక్కులే!



- మొదటిసారి పట్టుబడితే రూ.10వేల జరిమానా..
- రెండోసారి అయితే, రూ.15వేలు, జైలు శిక్ష, ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు
- జిల్లాలో కఠినంగా అమలు చేస్తున్న కొత్త విధానాలు
- 15 రోజుల్లో 130 మంది... ఒక్కొక్కరికీ రూ.10 వేల జరిమానా

మద్యం తాగి వాహనం నడిపితే వెయ్యో రెండు వేలో జరిమానా కట్టి తప్పించుకునే రోజులకు కాలం చెల్లింది. జిల్లాలో కొత్త పోలీస్ కమిషనర్ రాకతో డ్రంకెన్ డ్రైవ్ నిబంధనలు పూర్తిగా మారిపోయాయి. తాగి బండి నడుపుతూ మొదటిసారి పట్టుబడితే ఏకంగా రూ.10 వేల జరిమానా విధిస్తుండటంతో.. మందుబాబులు వాహనంతో రోడ్డెక్కాలంటేనే జంకుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సిద్దిపేట పోలీసులు చేపట్టిన ఈ కఠిన చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి.

సిద్దిపేట క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతన కమిషనర్‌గా విజయ్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పోలీస్ శాఖ పనితీరు, విధి విధానాలు మారాయి. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమైన "మద్యం సేవించి వాహనం నడపడం"పై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జిల్లా నలుదిక్కులా పోలీసులు విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక వంటి పట్టణాల్లో అర్ధరాత్రి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ మందుబాబుల ఆటకట్టిస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కఠిన శిక్షలు అమలు చేస్తున్నారు. తొలిసారి పట్టుబడితే కోర్టు ద్వారా రూ.10వేల జరిమానా విధిస్తున్నారు. జిల్లాలో గత 15 రోజుల్లో సుమారు 130 మంది డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడగా, వారందరికీ ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు. ఇక రెండోసారి దొరికితే రూ. 15 వేల జరిమానాతో పాటు 6 నెలలు జైలు శిక్ష విధిస్తారు. ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తారు. కోర్టులో జరిమానా కట్టిన తర్వాతే వాహనాన్ని అప్పగిస్తున్నారు. సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వారికి, వారి తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నారు.

రాజీవ్ రహదారిపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో బెజ్జంకి నుంచి ములుగు వరకు సుమారు 90 కిలోమీటర్లు మేర విస్తరించి ఉన్న రాజీవ్ రహదారిపై ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. బెజ్జంకి, టూ టౌన్, త్రీ టౌన్, కుకునూర్‌పల్లి, గజ్వేల్, గౌరారం, ములుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి పూట ప్రత్యేకంగా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తూ, మద్యం సేవించి వాహనం నడిపిన వారిని అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తున్నారు.

కఠిన చర్యలు తప్పవు



డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారికి రూ.10వేలు జరిమానా, రెండోసారి అయితే రూ.15వేలు, ఆరు నెలలు జైలు శిక్ష, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తాం. ఈ విషయంలో ఎలాంటి మినహాయింపు ఉండదు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనం నడపకూడదు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరిరంచాలి. కారులో వెళ్లేవారు సీటుబెల్టు పెట్టుకోవాలి. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి.

- సుమన్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ

నవ వధువు

ఆత్మహత్య

- అత్తింటి వేధింపులు తాళలేక..



వసంత

గజ్వేల్‌రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తెమ్మని భర్త అత్తమమామలు వేధింపులకు గురి చేయడంతో ఓ నవవధువు ఆత్మహత్య చేసుకుంది. గజ్వేల్ పట్టణంలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన వనం వసంత(21)ను గజ్వేల్‌కే చెందిన కండెల రోహిత్‌తో ఆగస్టు 10న వివాహం జరిగింది. వివాహ సమయంలో 18 తులాల బంగారం, రూ.10 లక్షల కట్నం ఇచ్చి అంగరంగ వైభవంగా వివాహం జరిపించారు. వివాహం జరిగిన నెల నుంచే వసంతను అదనపు కట్నం తీసుకురావాలని భర్త, అత్తామామ వేధించడం ప్రారంభించారు. లేకపోతే విడాకులు ఇస్తానని బెదిరించేవారు. వివాహేతర సంబంధం అంటగట్టేవారు. అప్పటి నుంచి ఎలాగోలా భరించిన ఆమె.. వేధింపులు అధికం కావడంతో ఈ నెల 1న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ విషయం తండ్రికి ఫోన్ చేసి చెప్పడంతో ఆయన వెంటనే వెళ్లి, స్థానికుల సహాయంతో లక్ష్మక్కపల్లిలోని ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ బుధవారం వసంత మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్కడి పనులు అక్కడే!

- మరో 40 రోజుల్లో కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణం
- కల్యాణంతో మహాజాతర ప్రారంభం
- నత్తనడకన సాగుతున్న అభివృద్ధి పనులు
- అసంపూర్తిగా క్యూకాంప్లెక్స్, 50 గదుల సత్రం నిర్మాణ పనులు
- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పడకేసిన నిర్మాణాలు!
- మంత్రి, అధికారులు సమీక్షిస్తేనే పనులు త్వరగా పూర్తి

కొమురవెల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఏళ్లుగా అసంపూర్తిగా ఉండిపోయాయి. క్యూ కాంప్లెక్స్ భవన నిర్మాణం, బండగుట్టపై 50 గదుల సత్రం నిర్మాణం, విజయాచల గుట్టపై త్రిశూలం, ఢమరుకం నిర్మాణ పనులు ఆగుతూ, కొనసాగుతూ ఉండటం వల్ల భక్తులు వసతి, దర్శనం విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యేటా స్వామివారిని సుమారు 25 లక్షల నుంచి 30 లక్షల మంది భక్తులు దర్శించుకుంటారు. జాతర సమయంలో ప్రతి ఆదివారం లక్ష మందికి పైగా భక్తులు వస్తుంటారు. ఆలయానికి ఏడాదికి సుమారు రూ. 22కోట్ల ఆదాయం సమకూరుతున్నప్పటికీ, భక్తుల సౌకర్యాలు మాత్రం మెరుగుపడటం లేదు.

మరో 40 రోజుల్లో మహాజాతర ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఏళ్లుగా కొనసాగుతున్న అభివృద్ధి పనులపై దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామిలు తక్షణమే ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉంది. మంత్రులు ఆలయ అభివృద్ధిపై, ఆగుతూ కొనసాగుతున్న పనులపై సమావేశమై, జాతర ప్రారంభం నాటికి క్యూ కాంప్లెక్స్ భవనం, బండగుట్టపై 50 గదుల సత్రం, విజయాచల గుట్టపై ఢమరుకం, త్రిశూలం నిర్మాణాలను పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేస్తేనే భక్తులకు సౌకర్యాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.



కొనసాగుతున్న 50 గదుల సత్రం నిర్మాణ పనులు



క్యూకాంప్లెక్స్ భవనంలో కొనసాగుతున్న పనులు

కాంట్రాక్టర్ల నిర్లక్ష్య ధోరణి

మల్లికార్జున స్వామి ఆలయ పరిధిలో క్యూ కాంప్లెక్స్ భవన నిర్మాణానికి రూ. 12కోట్లు, బండగుట్టపై 50 గదుల

మిగతా 8వ పేజీలో

విద్యుదాఘాతంతో పౌల్ట్రీ రైతు మృతి



రాజు మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

సిద్దిపేట రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో పౌల్ట్రీ మృతి చెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లి, మాచాపూర్ శివారులో బుధవారం చోటుచేసు కుంది. సిద్దిపేట రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం బల్వాంతపూర్ గ్రామానికి చెందిన జంగిటి రాజు (33) సీతారాంపల్లి గ్రామానికి చెందిన రైతు పడిగె నర్సయ్య వద్ద పౌల్ట్రీఫారంను లీజుకు తీసుకున్నాడు. బుధ వారం కోడిపిల్లలు రావడంతో వాటిని నీళ్లు పెట్టేందుకని ఇంటిదగ్గర చెప్పివెళ్లాడు. పౌల్ట్రీఫాం వద్ద బోరుమోటార్ నడవకపోవడంతో ట్రాన్స్‌ఫా ర్మర్ ఆఫ్ చేసే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో వెళ్లి చూడగా, చనిపోయి కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోనాయిపల్లిలో తీవ్ర గాయాలు



గాయాలపాలైన స్వామి గౌడ్

దౌల్తాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రైతుకు తీవ్ర గాయాలైన సంఘటన దౌల్తాబాద్ మండల పరిధిలోని కోనాయిపల్లి గ్రామంలో బుధ వారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలి పిన వివరాల ప్రకారం.. కోనా యిపల్లి గ్రామానికి చెందిన రైతు స్వామిగౌడ్ తన వ్యవ సాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా ప్రమాద వశాత్తు విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘ టన స్థలానికి చేరుకున్న అంబులెన్స్ మెడికల్ టెక్నీషియన్ దేవేందర్, పైలెట్ నరసింహులు బాధితుడు స్వామి గౌడ్‌ను మెరుగైన చికిత్స కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భలే కోడళ్లు.. బంగారం పదిలం

● చోరీకి దుండగుల విఫలయత్నం

దుబ్బాక, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోడళ్ల ముందుచూపు ఇంట్లోని బంగారం దొంగలపాలు కాకుండా కాపాడింది. ఈ సంఘటన దుబ్బాక మండలం గోసాన్‌పల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. బుధ వారం దుబ్బాక ఎస్‌ఐ కీర్తిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గోసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఆసిక నర్సింహులు తన ఇంటికి తాళం వేసి అనారో గ్యంతో ఉన్న బంధువును పరామర్శించడానికి భార్యతో కలిసి ఓ ఆసుప త్రికి వెళ్లారు. ఇదే అదునుగా దొంగలు ఇంట్లోకి చొరబడి, బీరువాను పగ లగొట్టి చోరీకి ప్రయత్నించారు. ఇంటికి తిరిగి వచ్చిన యజమాని తాళం పగిలి ఉండడం చూసి, ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. నర్సింహులు కుమారులు అసిక ప్రభాకర్, అర్జున్ తమ భార్యాపిల్లలతో కలిసి వృత్తిరీత్యా వేరే చోట ఉండడంతో, వారికి చెందిన 18 తులాల వరకు బంగారం చోరీ జరిగిందని అందరూ భావించారు. ఈ సమాచారాన్ని కోడళ్లు తన్విక, చామంతికి చేరవేయగా.. అప్పటికే వారు ముందుచూపుగా ఇంట్లోనే ఎవరికీ తెలియని ప్రదేశంలో బంగా రాన్ని ఒక బ్యాగులో పెట్టి దాచిపెట్టినట్లు చెప్పారు. పోలీసులు ఆ బ్యాగును పరిశీలించగా బంగారు నగలు కనిపించాయి. దీంతో ఇంటి యజమాని ఊపిరి పీల్చుకున్నారు.

ఎనిమిది తులాల బంగారు గాజులు చోరీ

హుస్నాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణం లోని బస్టాండ్ ఎదుట ఉన్న ఎస్‌వీ రమణకు చెందిన ఇంట్లో బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న ఎనిమిది తులాల బంగారు గాజులను దోచుకెళ్లినట్లు బాధితులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంట్లో పని చేసే వారు తీసుకెళ్ళారా..? లేక ఎవరైనా చోరీకి పాల్పడ్డారా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. బాధితులు ఇప్పటికీ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

నలుగురు నిందితుల అరెస్ట్

వర్గల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నలుగురు నిందితులను గౌరారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి వివరాలను బుధవారం గజ్వేల్ ఏసీపీ నర్సింహులు మీడియాకు వెల్లడిం చారు. గజ్వేల్ పట్టణానికి చెందిన పర్వతం నర్సింహులు (35), తూర్పాటి వంశీ (20), కొల్గూరు గ్రామానికి చెందిన 15 ఏళ్ల మైనర్ కొన్ని రోజు లుగా వర్గల్, రాయపోల్, ములుగు మండలాల్లోని ఆలయాల తాళాలు పగలగొట్టి ఇత్తడి గంటలు, రాగి పళ్లాలు, ఇతర పూజ వస్తువులు, హుండీలోని డబ్బులను దోచుకెళ్లేవారు. వరుసగా చోరీలతో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గౌరారం ఎస్‌ఐ కరుణకర్‌రెడ్డి నిఘా పెంచారు. నమ్మదగిన సమాచారం మేరకు వర్గల్ గ్రామంలోని కల్లుదుకాణంలో ఇద్దరిని, ఓ బాలుడిని అదుపులోకి తీసుకుని విచారించ డంతో చోరీలు చేసినట్లు అంగీకరించారు. వీరు దొంగలించిన వస్తువ లను వర్గల్‌కు చెందిన కూరాకుల అంజనేయులుకు విక్రయించగా, అత నినీ అరెస్ట్ చేశారు. నిందితులు రాయపోల్ మండలంలోని మీరా మీరాన గర్‌లో వీరప్ప స్వామి గుడిలో చోరీ చేశారు. ములుగు మండలం తునికి బోల్లారంలో ఓ ఇంటి ఎదుట నిలిపి ఉన్న టీవీఎస్ ఎక్స్‌ఎల్‌ను ఎత్తుకె ళ్లారు. వర్గల్ మండలం శాఖారం గ్రామంలోని పెద్దమ్మ గుడి, రాయపోల్ మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో పెద్దమ్మ గుడి, అనాజీపూర్ గ్రామంలోని పెద్దమ్మ గుడి, గొల్లపల్లి గ్రామంలోని పెద్దమ్మ గుడి, వర్గల్ మండలంలోని తునికిఖాల్సా గ్రామంలో ఎల్లమ్మ దేవాలయం, ఉమా లింగేశ్వరస్వామి ఆలయంలో హుండీ ధ్వంసం, వేలూర్ గ్రామ శివారు లోని పెద్దమ్మ ఆలయాలలో తాళాలు పగులగొట్టి గుడిలో ఉన్న ఇత్తడి ప్లేట్, మాణిక్యాలు, గుడి గంటలు, ఇతర వస్తువలు దొంగలించినట్లు తేలింది. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపైడ్, ఒక పెద్ద గుడి గంట, ఇత్తడి ప్లేట్, రెండు ఇత్తడి మాణిక్యాలు, రాగి చెంబు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకు న్నారు. పర్వతం నర్సింహులుపై తొమ్మిది కేసులు ఉండగా, చిన్న కోడూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం చేసిన కేసులో గతంలో శిక్ష అనుభవించి జైలుకు వెళ్లి వచ్చాడు. తూర్పాటి వంశీపై రెండు కేసులు, బాలుడిపై మూడు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వడ్ల కుప్పలను ఢీ కొని రెండు ఆటోలు బోల్తా

● లక్ష్మాపూర్ వద్ద పాదచారి ఢీకొన్న బైక్
● మూడు ఘటనల్లో 16 మందికి గాయాలు

రామాయంపేట, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): మూడు ప్రమాదాల్లో 16 మంది గాయాల పాలైన ఘటనలు రామాయంపేట మండల పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. అక్కన్న పేట శివారు ఎల్కతుర్తి హైవేపై వరి ధాన్యం కుప్పలను ఢీకొని ఒకే చోట రెండు ఆటోలు అదుపుతప్పి బోల్తాపడగా.. 13 మంది ప్రయాణికులు గాయపడ్డారు. అలాగే ఇదే మండలం లక్ష్మాపూర్ గేట్ వద్ద ద్విచక్రవాహ నదారుడు పాదచారిని ఢీకొనగా ముగ్గురు గాయపడ్డారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య



కుమార్ (ఫైల్)

గజ్వేల్ రూరల్ నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : మండ లంలోని సంగుపల్లికి చెందిన బక్కోళ్ల కుమార్(25) నాలుగేళ్ల నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా తగ్గకపోగవడంతో జీవితం పై విరక్తి చెంది బుధవారం గ్రామంలోని దుర్గమ్మ దేవా లయం వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కుటుంబ సమేతంగా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్

వైభవంగా స్వామివారి కల్యాణం

● హాజరైన ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్

ఝరాసంగం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతంలో ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఉదయం అమృత గుండంలో స్నానాలు ఆచరించి, స్వామి వారి దర్శనం కోసం క్యూలో బారులు తీరారు. ఆలయ ఆవరణలో దీపాధన కార్యక్రమాలను చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా స్వామి వారి కల్యాణం

కేతకీ ఆలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ కుటుంబ సమేతంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మొదట ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హనుమంతు రావు పాటిల్, బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖామణి అదూత గిరి మహారాజ్, ధనసిరి ఆశ్రమ పీఠాధిపతి విశ్వేశ్వర శివచార్య మహారాజ్, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్, ఆలయ ఈవో శివరుద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

అష్టాదశ శక్తిపీఠ ఆలయ వార్షికోత్సవాలు షురూ



కొండపాక, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):కొండపాక ఆనంద నిలయం ఆవరణలో గల అష్టాదశ శక్తిపీఠ దేవాలయంలో ద్వితీయ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం ఉమారామలింగేశ్వర శాంతి కల్యాణ మహోత్సవం కనులపండవగా నిర్వహించారు.

మద్దతు ఉత్తదేనా?

- సోయా రైతుల ఆవేదన
- ఇంకా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని అధికారులు
- నెలరోజులుగా రైతుల ఎదురుచూపులు
- తప్పనిపరిస్థితుల్లో దళారులకు విక్రయం
- క్వింటాల్‌కు రూ.1400 చొప్పున నష్టపోతున్న అన్నదాతలు

కంగ్టి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు ప్రభుత్వాలు మద్దతు ధరలు ప్రకటించడంలో చూపిన ఆర్భాటం, వాటికి అనుగుణంగా సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో చూపడం లేదు. ఈ తీవ్ర జాప్యం కారణంగా రైతులకు ఎలాంటి మేలు జరగడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలను సోషల్ మీడియాలో, పత్రికా ప్రకటనల్లో చూసి సంతోషించినా, పంట అమ్ముకునే సమయానికి రైతులకు దళారులను ఆశ్రయించక తప్పడం లేదు. దీనికి ప్రధాన కారణం, రైతులకు అందుబాటులో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడమే.

నెల రోజుల క్రితమే నూర్పిడి..

వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న కంగ్టి మండలంలో ఈ ఖరీఫ్‌లో వర్షాధారం కింద దాదాపు 12 వేల ఎకరాల్లో సోయా పంటను సాగు చేశారు. గిరిజన రైతులు తమకు అనుకూలంగా ఉన్న గట్టు భూముల్లో అధికంగా మొక్కజొన్నను కూడా సాగు చేశారు. సోయాతో పాటు మొక్కజొన్న పంటలను రైతులు దాదాపు నెల రోజుల క్రితమే నూర్పిడి చేయించారు. ఈసారి ఎడతెరిపి లేని వర్షాలు కురిసినప్పటికీ, రైతులు ఎంతో కష్టపడి పంటను కాపాడుకున్నారు. అధిక వర్షాల కారణంగా ఈ సంవత్సరం సోయాతో పాటు ఖరీఫ్ పంటల దిగుబడులు బాగా తగ్గాయి.



తుర్కవడగాంలో సోయా పంటను ఆరబెడుతున్న రైతు

దళారులకే దిక్కు..

ప్రభుత్వం మొక్కజొన్నలకు రూ.2,400, సోయా పంటకు రూ.5,400 మద్దతు ధర ప్రకటించింది. కానీ, ఇప్పటికీ రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో, పంట సాగు, పెట్టుబడుల కోసం చేసిన అప్పులు చెల్లించాల్సిన తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు సోయా, మొక్కజొన్నలను దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రైవేటు వ్యాపారులు రైతుల వద్ద నుంచి సోయాను క్వింటాల్‌కు కేవలం రూ.4,000 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. దీంతో, ఒక క్వింటాల్ సోయాపై రైతు రూ.1,400 వరకు నష్టపోవాల్సి వస్తోంది. రైతులు దళారులకు పంటలు అమ్మి నష్టపోవద్దని ఉపన్యాసాలు ఇచ్చే అధికారులు, ప్రజా ప్రతినిధులు... సమయానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించకపోవడంలో ఆంతర్యం ఏమిటని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

మద్దతు ధర లభిస్తేనే మేలు!



మండలంలో ప్రభుత్వం తక్షణమే సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి రైతులకు మేలు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే చాలా ఆలస్యం జరిగింది. దళారులు రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకొని తక్కువ ధరకే సోయా కొనుగోలు చేస్తున్నారు. దిక్కుతోచని స్థితిలో రైతులు దళారులకు అమ్ముకోవాల్సి వస్తుంది.

- పంతులు నాయక్, రైతు, పర్తుతండా

వర్షాలతో దిగుబడులు బాగా తగ్గాయి



గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఖరీఫ్ ఆరంభం నుంచి భారీ వర్షాలు కురవడంతో సోయా పంట దిగుబడులు బాగా తగ్గాయి. ఎన్నో ఆశలతో పెట్టుబడులు పెట్టినప్పటికీ రైతులకు ఏమి మిగలడం లేదు. కనీసం మద్దతు ధరకైనా ఉన్న కొద్ది పంటను అమ్ముకుందామంటే, కొనుగోలు కేంద్రాలు లేక అది కూడా అందని ద్రాక్షగానే మిగులుతుంది.

- మెండె హన్మారెడ్డి, రైతు, కంగ్టి

నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

● హాజరుకానున్న 935 మంది విద్యార్థులు

హత్నూర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన హత్నూరలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల కళాశాలలో రాష్ట్రస్థాయి 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు. ఈ క్రీడోత్సవాల్లో రాష్ట్రంలోని 11 పాఠశాలలకు చెందిన 935 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. వాలీబాల్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్ వంటి క్రీడలను అండర్-14, 17, 19 స్థాయి విద్యార్థులకు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. విద్యార్థులకు భోజన, వసతి, ఆరోగ్యం మొదలైన వాటిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీకాంత్ స్పష్టం చేశారు.



పరిశ్రమ ఎదుట దర్నా చేస్తున్న గ్రామస్థులు

పరిశ్రమ మూసివేయాలని ధర్నా

శివ్వంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పోతులబోగుడ గ్రామంలోని సుగుణ పరిశ్రమను తక్షణమే మూసివేసి తమ గ్రామాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ బుధవారం గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పరిశ్రమ ముందు రెండు గంటల పాటు బైఠాయించి ధర్నా నిర్వహించారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న దుర్వాసన కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసనతో కాలుష్య సమస్య ఎదుర్కొంటున్నామని వాపోయారు. సుమారు 15 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమ మొదట సుగుణ పౌల్ట్రీ ఫామ్‌గా నడిచి, నాలుగు సంవత్సరాల క్రితం సుగుణ హేచరీస్‌గా మార్చబడిందన్నారు. కోళ్ల వ్యర్థాలను రోడ్డుకు సమీపంలో పారబోయడం వల్ల ఈగలు, దోమలు పెద్ద సంఖ్యలో వ్యాప్తి చెంది, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. చుట్టుపక్కల వ్యవసాయ భూములు ఉండటం వల్ల నీటి వనరులు కలుషితం అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, పరిశ్రమపై చర్యలు తీసుకొని, గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పోతులబోగుడ గ్రామస్థులు డిమాండ్ చేశారు.



మార్క్స్‌నగర్ యూపీహెచ్‌సీలో వ్యాక్సిన్ వాయిల్‌ను పరిశీలిస్తున్న బృందం

ముగిసిన సీఆర్ఎం బృందం పర్యటన

● చివరి రోజు సంగారెడ్డిలోని రెండు ఆరోగ్య కేంద్రాల పరిశీలన

సంగారెడ్డి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో కామన్ రివ్యూ మిషన్ (సీఆర్ఎం) బృందం పర్యటన ముగిసింది. మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా పలు ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలు, సబ్ సెంటర్లను తనిఖీ చేసిన విషయం తెలిసిందే. చివరి రోజు బుధవారం సంగారెడ్డి పట్టణంలోని మార్క్స్‌నగర్ యూపీహెచ్‌సీని కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఓపీ, మందులు, ఎన్‌సీడీ స్క్రీనింగ్, ల్యాబ్ పరీక్షలు, రికార్డుల నిర్వహణ, వ్యాక్సినేషన్, కేంద్ర వైద్య పథకాల అమలుపై ఆరా తీశారు. అనంతరం ఇంద్రనగర్‌లోని ఆయూష్ డిస్పెన్సరీలను సందర్శించారు. ఆయుర్వేద, హోమియోపతి, యునానీ డిస్పెన్సరీల డాక్టర్లతో మాట్లాడారు. ఆయా డిస్పెన్సరీలకు ఎటువంటి సమస్యలతో ప్రజలు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అటెండెన్స్, ఈ-ఔషధి తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయూష్ కన్సల్టెంట్ డా.రంజన్ దాస్, ఎస్‌పీఎం డా.సంతోష్, ప్లానింగ్ పీవో జగన్నాథ్‌రెడ్డి, డీఐవో డా.శశాంక్ దేశపాండే, మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌గా ఉమ్మడి మెదక్ జిల్లా

మెదక్ అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు ఘనవిజయం సాధించింది. పాఠశాల క్రీడా సమాఖ్య తెలంగాణ ఆధ్వర్యంలో వికారాబాద్‌లో మూడు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 బాలికల టోర్నమెంట్ జరుగుతుంది. బుధవారం రంగారెడ్డి జిల్లా జట్టుతో జరిగిన సెమీఫైనల్‌లో 1-0 తేడాతో ఉమ్మడి మెదక్‌జిల్లా జట్టు విజయం సాధించి ఫైనల్‌కు అర్హత పొందింది. ఫైనల్‌లో ఉమ్మడి నల్గొండ జట్టుపై హోరాహోరీగా జరిగిన మ్యాచ్ డ్రాతోయ ముగిసింది. పెనాల్టీ షూట్ అవుట్‌లో ఉమ్మడి మెదక్ జట్టు నల్గొండ జట్టుపై 3-2 గోల్స్ తేడాతో గెలిచి కప్ కైవసం చేసుకుందని మెదక్ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు తెలిపారు.



గెలిచిన ఆనందంలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు

ఐఐటీహెచ్‌లో రెండో ఎడిషన్ హాఫ్ మారథాన్

- రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 10 వరకు గడువు
- 30న రన్నింగ్ పోటీలు

కంది, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సాహించడానికి సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్(ఐఐటీహెచ్)లో నవంబరు 30న రన్నర్స్ హాఫ్ మారథాన్ 2వ ఎడిషన్‌ను నిర్వహించనున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, నగరాల నుంచి ఫిట్నెస్ ఔత్సాహికులు, రన్నర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 10 తేదీ వరకు ఐఐటీహెచ్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని తెలిపారు. 5కే రన్, 10కే రన్, 21కే మారథాన్‌లతో పాటు ఫన్‌రన్ ఈవెంట్లు ఉంటాయని, విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు, పతకాలు, బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనేవారు 18 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని తెలిపారు.



బోరంచ టూరిజానికి రూ.2.5 కోట్లు

● ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నారాయణఖేడ్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూరు మండలం బోరంచను టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం రూ.2.5 కోట్లు మంజూరు చేసిందని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, మనూరు మండలం బోరంచ నది ఒడ్డున చారిత్రకమైన నల్ల పోచమ్మ ఆలయంతో పాటు సంగమేశ్వర ఆలయాలు ఉన్నాయన్నారు. బోరంచ బ్యాక్‌వాటర్ సంగమేశ్వర ఆలయం వెనుక వరకు ఉంటుందన్నారు. బోరంచ పోచమ్మను దర్శించుకునేందుకు తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున వస్తుంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో, బోరంచను టూరిజం స్పాట్‌గా మార్చాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కోరగా, ఆయన నివేదిక తెప్పించుకొని, మొదటి దశలో రూ.2.5 కోట్లను మంజూరు చేశారని ఎమ్మెల్యే వివరించారు. ఈ నిధులతో మంజీరాలో బోటింగ్‌తో పాటు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. మరిన్ని నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరతామని, అంతేకాకుండా మనూరు మండలం కమలాపూర్ ప్రాజెక్టు, నారాయణఖేడ్ పట్టణానికి సమీపంలో ఉన్న నల్లవాగును కూడా టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరామని సంజీవరెడ్డి తెలిపారు. బోరంచకు నిధులు మంజూరు చేయించినందుకు పోచమ్మ, సంగమేశ్వర ఆలయ కమిటీ బాధ్యులు ఎమ్మెల్యే సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శనరెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డితో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



నూతన ఒర'బడి'

- మారిన బుసారెడ్డిపల్లి పాఠశాల రూపురేఖలు
- పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణం
- గోడలపై అర్థవంతమైన పెయింటింగ్స్
- హెచ్ఎం రమణ సొంత ఖర్చుతో పనులు
- 40 నుంచి 70కి పెరిగిన విద్యార్థుల సంఖ్య



చిత్రాలను గీస్తున్న ఉపాధ్యాయుడు

మునిపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానాన్ని బోధించడమే కాకుండా, విశాల హృదయంతో అత్యుత్తమ సేవలు అందిస్తూ... కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా సర్కారు బడి రూపురేఖలను మార్చారు సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి ఉన్నత ప్రాథమిక పాఠశాల (యూపీఎస్) హెచ్ఎం ఎస్‌వీ రమణ కుమార్. కేవలం వృత్తి ధర్మంగా కాకుండా, పాఠశాల అభివృద్ధికి తనవంతు పాత్ర పోషిస్తూ, ఉపాధ్యాయ వృత్తికే ఆదర్శంగా నిలిచారు. సొంత డబ్బుతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూ అందరి మన్ననలు పొందారు. పాఠశాల భవనం, ఆవరణలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఆయన చేసిన సేవలకు ముగ్ధులైన గ్రామస్థులు, ఆయనకు ప్రమోషన్ వచ్చినప్పటికీ, తమ ఊరి బడిలోనే కొనసాగాలని విజ్ఞప్తి చేశారు. వారి ప్రేమకు బద్ధుడై రమణ కుమార్ తన ప్రమోషన్‌ను కూడా రద్దు చేయించుకోవడం విశేషం.

ప్రైవేటును వీడి ప్రభుత్వ బడికి..

రమణ కుమార్ కృషితో ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న పిల్లలు, బడి మానేసిన విద్యార్థులు కూడా సర్కారు బడి వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో 40 మంది ఉన్న విద్యార్థుల సంఖ్య ఇప్పుడు 70కి పెరిగింది.

ఎనిమిదేళ్ల ఏళ్ల క్రితం రమణ కుమార్ ఈ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా వచ్చినప్పుడు అనేక సమస్యలు ఉండేవి. ప్రభుత్వపరంగా ప్రతి సంవత్సరం వచ్చే రూ.10 వేలతో స్పోర్ట్స్ సామాగ్రి కొనుగోలు చేశారు. తన సొంత డబ్బు రూ.72 వేలతో పాఠశాల ముఖ్యద్వారం ఏర్పాటు చేయించారు. అదే గ్రామానికి చెందిన గడీల రమేష్ సహకారంతో పాఠశాల ఆవరణలో సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. స్కూల్ ముఖద్వారం నుంచే పచ్చని వనంలా మొక్కలను పెంచి పాఠశాలకు కొత్త అందాన్ని తీసుకొచ్చారు. విద్యార్థులు భోజనం చేసిన తర్వాత మిగిలిన ఆహారాన్ని ఉపయోగించి సేంద్రియ ఎరువు తయారు చేసి, ఆవరణలో కిచెన్ గార్డెన్ (కూరగాయల తోట) ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లను సైతం వినియోగంలోకి తీసుకువచ్చారు.

ఉపాధ్యాయుడే ఆర్టిస్టుగా మారి..

పాఠశాల ఉపాధ్యాయుడు మధు ఆర్టిస్టుగా మారి గోడలపై పెయింటింగ్ వేస్తూ బడికి అందాన్ని తెచ్చారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివిధ అంశాలను చిత్రీకరించారు. విద్యార్థుల బోధనతో పాటు పెయింటింగ్‌తో పాఠశాల అభివృద్ధిలో పాలుపంచుకుంటున్నారు.

ఉద్యోగ విరమణ వరకూ ఇక్కడే ఉంటా..

గ్రామస్థులు, ఉపాధ్యాయుల సహకారంతోనే పాఠశాల ఈ స్థాయిలో ఉంది. విద్యార్థులను తన సొంత పిల్లల్లా చూసుకుంటున్నాను. పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలన్నదే నా లక్ష్యం. నా ఉద్యోగ మిరమణ వరకూ ఇక్కడే ఉంటాను. పాఠశాల ప్రగతి కోసం దాతలు ముందుకు రావాలి.

- ఎస్‌వీ రమణ కుమార్, హెచ్ఎం

నా పిల్లలను ఈ బడిలోనే చేర్పించాను..



మొదట నా ఇద్దరు పిల్లలను ప్రైవేటు బడికి పంపిందామనుకున్నాను. కానీ పాఠశాలపై రమణ సార్ తీసుకుంటున్న చొరవ చూసి ప్రభుత్వ బడిలోనే చేర్పించాను సార్ వచ్చినప్పటి నుంచి పాఠశాల రూపురేఖలే మారిపోయాయి.

- సతీష్, స్థానికుడు



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

టిప్పర్ల యజమానుల ఆగడాలను అరికట్టాలి

● లక్డారం గ్రామస్థుల నిరవధిక దీక్ష




ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) :రోడ్లపై అరాచకం సృష్టిస్తూ ప్రజల ప్రాణాలు బలిగొంటున్న టిప్పర్ల యజమానుల ఆగడాలపై లక్డారం గ్రామస్థులు కన్నెర చేశారు. వెంటనే వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం గ్రామస్థులు లక్డారం రోడ్డుపై ఆందోళన చేయడంతోపాటు నిరవధిక దీక్షలు చేపట్టారు. అధిక లోడుతో రాకపోకలు సాగిస్తూ రోడ్లను పాడు చేస్తున్నారన్నారు. టిప్పర్లతోనే రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని ఆరోపించారు. క్రషర్ల వల్ల గ్రామంలోని ఇళ్లన్నీ బీటలు వారుతున్నాయని వాపోయారు. పంట పొలాలన్నీ పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాయల్టీ, వే బిల్లులు లేకుండా రవాణా చేస్తున్న టిప్పర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ యువ సంఘం నాయకులు కృష్ణ గౌడ్, చంద్రశేఖర్, రాఘవరెడ్డి, రామచంద్రారెడ్డి, డాకయ్య సాగర్, వీరేశం, శ్రీకాంత్, నరసింహ గౌడ్, సంజీవరెడ్డి, గోపాల్ చారి, నాగరాజు, సాగర్ పాల్గొన్నారు. స్థానిక టిప్పర్ల యజమానులు నిర్మల్, నాగార్జున కూడా ఈ ఆందోళనలో పాల్గొనడం గమనార్హం.

ఆలయాలకు కార్తీక పౌర్ణమి శోభ



అక్బర్‌పేట- భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి కూడవెల్లి రామలింగేశ్వరాలయంలో కార్తీకపౌర్ణమి పూజలు



మండలం రామేశ్వరంపల్లి కూడవెల్లి రామలింగేశ్వరాలయంలో కార్తీకపౌర్ణమి పూజలు



చేర్యాల పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలలో పాల్గొన్న భక్తులు

జిల్లాలో బుధవారం కార్తీక పౌర్ణమి సంబరాలు ఘనంగా సాగాయి. ప్రధాన ఆలయాలు కార్తీక పౌర్ణమి శోభను సంతరించుకున్నాయి. తెల్లవారు జామునే ఆలయంలో కార్తీక దీపాలను వెలిగించి, దైవదర్శనాలు చేసుకున్నారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

సిద్దిపేట//చేర్యాల/దుబ్బాక, నవంబరు5(ఆంధ్రజ్యోతి)



నంగునూరు మండలం బద్దిపడగ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



వెంకట్రావుపేట సంతాన వేణుగోపాల స్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలలో పాల్గొని పూజలు చేస్తున్న భక్తులు



హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో వైభవంగా చండీ హోమం

కేంద్ర మంత్రిపై కేసు నమోదు చేయాలి

● అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్

హుస్నాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలను పోలింగ్ బూత్‌ల వద్దకు రానివ్వకండి అని వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి లలన్ సింగ్‌పై కేసు నమోదు చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని అవమాన పరచిన లలన్ సింగ్ రాబోయే ఎన్నికల్లో పోటీ చేయకుండా చర్యలు తీసుకోవడమే కాకుండా ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలన్నారు. బుధవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో జరిగిన అంబేద్కర్ సంఘం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేయాలి



గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో దెబ్బతిన్న ప్రధాన రోడ్డు

గజ్వేల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డును మరమ్మతు చేయాలని టెలికాం బోర్డు సభ్యులు, బీజేపీ నాయకులు కమ్మరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్డులో ఏర్పడిన గుంతలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులు తక్షణమే స్పందించి రోడ్డును మరమ్మతు చేయాలని, సమస్యను పరిష్కరించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు. నిత్యం ద్విచక్ర వాహనదారులు అనేక రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించినా అధికారుల నుంచి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు మహనీయుల విగ్రహాల వద్ద మౌనదీక్ష

సిద్దిపేట, నవంబరు5(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించడం పూర్తిగా విఫలమైందని మిరుదొడ్డి బీసీ సంఘం నాయకులు బాల్‌రాజు, శ్రీనివాస్‌లు అన్నారు. బుధవారం మిరుదొడ్డిలో వారుమాట్లాడారు. రాష్ట్రంలోని బీసీల జనాబా ధమాషా ప్రకారం 42శాతం రిజర్వేషన్లను కల్పించాలని కోరారు. 42శాతం రిజర్వేషన్ చేయాలంటూ రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు గురువారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, జ్యోతిబాపూలే విగ్రహాల వద్ద మౌనదీక్షను చేపట్టుకున్న తెలిపారు.

కొనుగోలు కేంద్రం వద్ద కోతుల బెడద



చేర్యాల మార్కెట్‌యార్డు ప్రధానగేటు వద్ద వానర మూక

చేర్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయడంతో కొద్ది రోజులుగా రైతులు ధాన్యం తీసుకువచ్చి ఆరబోసుకుంటున్నారు. పట్టణంలో కోతులు గుంపులుగుంపులుగా స్వైరవిహారం చేస్తున్న క్రమంలో యార్డుకు చేరుకుని ఆహారం కోసం నానాయాగీ చేస్తున్నాయి. దీంతో పలువురు రైతులు ధాన్యంకుప్పల వద్ద కాపలా ఉంటున్నారు. పలు సందర్భాలలో కోతులు దూసుకువస్తుండటం వల్ల రక్షణ నిమిత్తం చాటున దాక్కుంటున్న పరిస్థితి నెలకొనడంతో ఆందోళన చెందుతున్నారు. మార్కెటింగ్, మున్సిపల్ అధికారులు చొరవ వహించి కోతుల బెడద తీర్చాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

పోచమ్మ వీధికి పోయేదెట్లా?

● గాంధీ చౌక్ వద్ద హై లెవల్ వంతెన నిర్మాణం
● ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని స్థానికుల వేడుకోలు

చేర్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేర్యాల పట్టణంలోని పోచమ్మవీధి, పాత గురుకుల పాఠశాల వీధిదారులు కనుమరుగవుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ప్రధాన చౌరస్తాగా నిలిచిన గాంధీ చౌక్ నుంచి కడవేరుగుకు, పోచమ్మవీధితో పాటు సమీపంలో పాత గురుకుల పాఠశాల వీధికి దారులున్నాయి. ఆయా కాలనీలలో సుమారు 150-200ఇళ్లున్నాయి. పోచమ్మ వీధి గుండా స్థానికులు నిత్యం పోచమ్మ ఆలయం, మార్కండేయ దేవాలయంతో పాటు కుడి చెరువుకు వెళ్తుంటారు. యేటా మార్కండేయ దేవాలయ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు జరిపి కుడిచెరువులో నిమజ్జనంచేస్తారు. కాని జనగామ సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల సందర్భంగా గాంధీ చౌక్ వద్ద హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. కుడిచెరువులోకి వరదనీరు మళ్లించడంతో పాటు భవిష్యత్ అవసరాల దృష్ట్యా బ్రిడ్జి ఎత్తు పెంచారు. అందుకు అనుగుణంగా రోడ్డు మధ్య నుండి 50 ఫీట్లలోపుగల భవనాలను కొన్నాళ్లక్రితం కూల్చివేసి రోడ్డుఎత్తుతో పాటు విస్తీర్ణంపెంచారు. దీంతో రోడ్డుపక్కనుండి పోచమ్మ, పాత గురుకుల పాఠశాల వీధిలోకి వెళ్లే మార్గాలు మూసుకుపోతున్నాయి. ప్రస్తుతం ఆయా వీధుల ప్రధాన ద్వారాలు కనుమరగుచేయడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కొన్నినెలలక్రితం గాంధీచౌక్ వద్ద నత్తనడకనక సాగుతున్న కల్వర్ట్ పనులు పరిశీలించిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆయా మార్గాలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపట్టాలని ఎన్‌హెచ్ అధికారులకు సూచించారు. అయినప్పటికీ ప్రత్యామ్నాయచర్యలు చేపట్టలేదు. స్థానిక నాయకులు, మున్సిపల్, ఎన్‌హెచ్ అధికా రులు సమన్వయంతో వ్యవహరించి పోచమ్మవీధి, పాత గురుకుల వీధులలోకి యధావిధిగా రాకపోకలు సాగింపచేయడంతో పాటు గాంధీచౌరస్తా పూర్వవైభవానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బ్రిడ్జికి అనుగుణంగా ఎత్తుపెంచుతూ చేపట్టిన రోడ్డునిర్మాణం

మాదిగ జాగృతి మండల అధ్యక్షుడిగా నరేశ్

సిద్దిపేట రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మాదిగ జాగృతి సంఘం మండలాధ్యక్షుడుగా బుస్సాపూర్ గ్రామానికి చెందిన మద్దూరి నరేశ్ మహరాజ్‌ను నియమించినట్లు మెదక్, సిద్దిపేట జిల్లాల అధ్యక్షులు రాజన్, మల్లికార్జున్‌లు బుధవారం తెలిపారు. ఈసందర్భంగా నరేశ్ మహరాజ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మండల అధ్యక్ష పదవి ఇచ్చినందుకు మెదక్, సిద్దిపేట జిల్లాల అధ్యక్షులు రాజన్, మల్లికార్జున్‌లకు, జిల్లా కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

చేర్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని వెంకటసాయి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో బుధవారం ఉచిత మెగావైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు అధికసంఖ్యలో హాజరవగా. ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు ఎం. శ్రీనివాస్, చర్మవ్యాధి నిపుణురాలు ఎల్.సుస్మిత తదితరులు 350మందికి ఉచితంగా వైద్యపరీక్షలు జరిపారు. ఉచితంగా బీఎండీ పరీక్షలు నిర్వహించి రోగనిర్ధారణ జరపడంతో పాటు ఆరోగ్యసూచనలిచ్చారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



శిబిరంలో వైద్యపరీక్షలు జరిపి ఆరోగ్య సలహాలిస్తున్న ఆర్థోపెడిక్ వైద్యుడు ఎం.శ్రీనివాస్

పంట నష్ట సర్వేను వేగవంతం చేయాలి

హుస్నాబాద్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వర్షాలతో దెబ్బతిన్న పంటల సర్వేలో వేగవంతం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని హుస్నాబాద్ మండలం కూచనపల్లిలో రైతులు నిరసన తెలిపారు. వర్షాలతో దెబ్బతిన్న పంటలను అధికారులకు చూపేందుకు రైతులు వరి పంటను కోయలేక పోతున్నారని, దీంతో వరి నీటిలో ఉండి మురిగిపోతుందన్నారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వాటి కోసం ఎదురుచూస్తున్నామన్నారు. నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ. 40 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, నాయకులు కేసిరెడ్డి రాంచంద్రారెడ్డి, తదితరులున్నారు.



కూచనపల్లి గ్రామంలో వరిపైరుతో రైతుల నిరసన

ఓబీ, ఈసీ సభ్యులకు ముగిసిన శిక్షణ

మద్దూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జాగృతి సమాఖ్య కార్యాలయంలో ఆఫీస్ బేరర్స్ మండల సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులకు మంగళవారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మండల సమాఖ్య నిర్వాహణ, గ్రామ సమాఖ్యల నిర్వాహణపై సీనియర్ సీఆర్పీలు మాధవి, పద్మ అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఎంఎస్ ఆఫీసు బేరర్లు బాధ్యతాయుతంగా నడుచుకోవాల్సి ఉంటుందని సూచించారు. ఏపీఎం ఖాతా ప్రకాశం, సీసీ మహేందర్, చంద్రమౌళి, కనకచంద్రం, సాయిలు పాల్గొన్నారు.

ఎక్కడి పనులు అక్కడే!



ఆగిపోయిన త్రిశూలం, ఢమరుకం నిర్మాణ పనులు

(5వ పేజీ తరువాయి)

సత్రం నిర్మాణానికి ఆలయ నిధులు, పంచాయతీ రాజ్ నిధులు కలిపి రూ. 10 కోట్లు, త్రిశూలం, ఢమరుకం నిర్మాణానికి సుమారు రూ. 68లక్షలకు టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నత్తనడకలా పనులు చేస్తుండటం వల్లే ఏళ్లుగా నిర్మాణాలు పూర్తి కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఒప్పందం ప్రకారం గడువు దాటినా, పనుల్లో వేగం పెంచేవారే కరువయ్యారని భక్తులు వాపోతున్నారు.

అదనపు నిధులు వెచ్చిస్తేనే

బండగుట్టపై నిర్మిస్తున్న 50 గదుల సత్రంతో పాటు కొండపై నిర్మిస్తున్న త్రిశూలం, ఢమరుకం నిర్మాణ పనులు పూర్తి కావాలంటే అదనపు నిధులు కావాలని ఇటీవల సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు ఆలయ అధికారులకు తెలిపినట్లు సమాచారం. ఈ అదనపు నిధులను ఎక్కడి నుంచి సమకూరుస్తారు అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. అదనపు నిధుల విషయం కొలిక్కి వస్తేనే నిర్మాణ పనుల్లో వేగం పుంజుకునే అవకాశం ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



క్యూ కాంప్లెక్స్ భవనం, 50 గదుల సత్రం, కొండపై ఢమరుకం, త్రిశూలం నిర్మాణ పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నాం. కల్యాణం నాటికి క్యూ కాంప్లెక్స్ భవన నిర్మాణాన్ని పూర్తిచేస్తామని కాంట్రాక్టర్ తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి కూడా ఈ విషయాలను తీసుకువెళ్లి వారి ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తాము. స్వామివారి కల్యాణం నాటికి అభివృద్ధి పనులను అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తాం

- టంకశాల వెంకటేష్, ఆలయ కార్యనిర్వహణాధికారి

పీడీఎస్‌యూ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

గజ్వేల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ శ్రీకాంత్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఈ మేరకు పీడీఎస్‌యూ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1970లో ప్రారంభమైన పీడీఎస్‌యూ అందరికి సమాన విద్య నిమిత్తం నిరంతరం పోరాటం చేసిందన్నారు. ఈ క్రమంలోనే జార్జిరెడ్డి, జేసీఎస్ ప్రసాద్, శ్రీపాద శ్రీకర్, కోల శంకర్, రంగవల్లి, స్నేహలతలను కోల్పోయామని అన్నారు. ఈ క్రమంలోనే పీడీఎస్‌యూ విద్యారంగ, విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న గజ్వేల్ పట్టణంలో నిర్వహించనున్న పీడీఎస్‌యూ జిల్లా 4వ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా సిద్ధప్ప వరకవి గురుపూజోత్సవం

కోహెడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారెడ్డిపల్లి సిద్ధప్ప వరకవి ఆశ్రమంలో ఆశ్రమ బాధ్యులు అనంతవరం మాణిక్యలింగం ఆధ్వర్యంలో గురుపూజోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా కార్తీక పౌర్ణమి రోజున ఈ వేడుకలు జరుపుతారు. గ్రామ పురవీధులలో వరకవి చిత్రపటంతో శోభయాత్ర నిర్వహించారు. గ్రామంలోని పోచమ్మ, హనుమాన్ దేవాలయాల వద్ద పూజలు చేపట్టారు. అనంతరం ఆశ్రమంలో గోల్కొండ కవిగా తెలంగాణ వేమనగా పేరుపొందిన సిద్ధప్ప వరకవి విగ్రహం వద్ద ఆయన కుటుంబ సభ్యులు, భక్తులు పూజలు నిర్వహించారు.

కారు ఢీకొని వృద్ధురాలి మృతి

కొండపాక, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని వృద్ధురాలు మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. రవీంద్రనగర్ గ్రామానికి చెందిన కోడెల బాల లచ్చవ్వ(60) కొండపాక స్టేజి వద్ద బుధవారం రాత్రి రోడ్డు దాటుతుండగా కారు ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన ఆమెను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నేతల ప్రచారం

కోహెడ/వర్గల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల కాంగ్రెస్ నాయకులు ఇంటింటా తిరుగుతూ ప్రచారం చుస్తున్నారు. హైదరాబాద్ జూబ్లీ హిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో వర్గల్ మండల కాంగ్రెస్ నాయకులు ఇంటింటా తీరుగుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసినట్లువంటి సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరిస్తూ ఓటువేయాలని కోరారు.

మండల కాగ్రెంస్ నాయకులు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా కోహెడ మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు యూసఫ్‌గూడ డివిజన్‌లోని కృష్ణనగర్ కాలనీలో బూత్ నెంబర్ 239 నుంచి 245 వరకు 7 బూత్‌లలో ప్రచారం నిర్వహించారు. కోహెడ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్, యువజన కాంగ్రెస్ నాయకులు ఇంటి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.



జూబ్లీహిల్స్‌లో ప్రచారం చేస్తున్న కోహెడ మండల కాంగ్రెస్ నాయకులు

మాజీ మంత్రి హరీశ్‌రావుకి పరామర్శ

గజ్వేల్ రూరల్/సిద్దిపేట అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): .సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీశ్‌రావును సిద్దిపేట రైస్ అండ్ ఆయిల్ మిల్ వర్కర్స్ యూనియన్ (బీఆర్‌టీయూ) అనుబంధం ఆధ్వర్యంలో బుధవారం పరామర్శించారు. యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తన నివాసంలో హరీశ్‌రావును కలిసి ఆయన తండ్రి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించినట్లు సంఘం నాయకులు తెలిపారు.

దళిత సంఘ నాయకులు

మాజీమంత్రి హరీష్ రావును వివిధ దళిత సంఘ నాయకులు పరామర్శించారు. బుధవారం హైదరాబాద్ కోకాపేటలో వారి నివాసంలో సత్యనారాయణరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.



హరీశ్‌రావును కలిసిన రైస్ మిల్లర్, ఆయిల్ మిల్లర్ అసోసియేషన్ నాయకులు

జ్వాలా తోరణం, దీపోత్సవాన్ని ప్రారంభించిన కలెక్టర్



జ్వాల తోరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, క్షేత్ర నిర్వాహకులు



దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

కొండపాక, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా కొండపాక మండలం మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో దీపోత్సవం దేదీప్యమానంగా జరిగింది. క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన దీపోత్సవాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి దీపం వెలిగించి ప్రారంభించారు. వేదమంత్రాల మధ్య శాస్త్రంగా జ్వాలతోరణం కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లకి సేవ నిర్వహించి జ్వాలాతోరణ కార్యక్రమాన్ని జరిపారు. అనంతరం వందలాదిగా తరలివచ్చిన భక్తులు దీపాలు వెలిగించి పూజల్లో పాల్గొన్నారు.



మర్పడగ క్షేత్రంలో దీపోత్సవం



దీపాలను వెలిగిస్తున్న మహిళ

జవహర్ నవోదయలో ప్రత్యేక అవసరాల గుర్తింపుపై వైద్య శిబిరం

వర్గల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో గజ్వేల్ ఈఎన్టీ హస్పటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాల గుర్తింపుపై వైద్య బృందం డాక్టర్ రాజమోహన్, హైమావతి ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు పోర్టబుల్ ఎండోస్కోపీ, డివాక్సింగ్ ప్రక్రియలను చేపట్టారు. కొందరు విద్యార్థులకు ముందు, ముందు ఏమన్నా వైద్య రీక్షలు అవసరమున్నట్లయితే భవిష్యత్తులో చికిత్సకు రిఫర్ చేయడమైంది. ఈ కార్యక్రమంలో నవోదయ ఇన్చార్జి ప్రిన్సిపాల్ నాగ భాస్కర్, విద్యాలయం స్టాఫ్ నర్స్ బిందు రెడ్డి, వైద్య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.